నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, సోమవారం 12 ఫిబ్రవరి 2024 | NALGONDA

'చలో నల్లగొండ'కు చకచకా ఏర్పాట్లు

రేపే బీఆర్ఎస్ బహిరంగ సభ

సన్నాహక సమావేశాలతో పార్టీ శ్రేణులు సన్నద్ధం
ప్రాజెక్టుల అప్పగింతపై విస్తృతంగా ప్రజల్లోకి...
సమాయత్తమవుతున్న కృష్ణా పరీవాహక ప్రాంత జనం

నల్లగొండలో బీఆర్ఎస్ సభకు చేస్తున్న ఏర్పాట్లు

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి11(నమస్తే తెలంగాణ) : కృష్ణానదీ ప్రాజెక్టుల పట్ల కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం ధోరణిపై బీఆర్ఎస్ పోరుబాటకు సిద్ధమైంది. కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింతను నిరసిస్తూ నల్లగొండ వేదికగా సమరశంఖం పూరించనుంది. ఈ నెల 13న చలో నల్లగొండ పేరుతో భారీ బహిరంగసభకు సన్నద్ధమవుతున్నది. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరుకానుండడంతో పార్టీ యావత్ రంగంలోకి దిగింది. సభా ప్రాధాన్యతను వివరిస్తూ పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశాలు నిర్వహించింది.

కృష్ణానది ప్రాజెక్టులపై ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న అధికారాలను కేంద్రం పరిధిలోని కేఆర్ఎంబీకి అప్పగిస్తూ కాంగ్రెస్ సర్కార్ చేసిన నిర్వాకంపై ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. ముఖ్యంగా కృష్ణా పరీవాహక ప్రాంత రైతాంగం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ప్రాజెక్టుల నిర్వహణ రాష్ట్ర పరిధిలో ఉండడం వల్ల తెలంగాణ వచ్చాక కృష్ణాజలాల్లో నీటి వాటాను నిక్కచ్చిగా అప్పటి కేసీఆర్ సర్కార్ వాడుకోగలిగింది. దీంతో గత పదేండ్లల్లో మొత్తం 18 పంటకాలలకు సాగునీరును సమృద్ధిగా ఇవ్వగలిగింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకంతో ఇక ముందు ఆ పరిస్థితి ఉండదు. దాంతో సాగునీటికే కాకుండా తాగునీటి అవసరాలకు కూడా ఇబ్బందులు తప్పవని ఇంజినీరింగ్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్లనే కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతను బీఆర్ఎస్ వెలుగులోకి తెచ్చి ప్రజలను చైతన్యం చేసే దిశగా కార్యాచరణ చేపట్టింది. అందులోభాగంగా మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంగా చలో నల్లగొండ పేరుతో బహిరంగ సభకు సిద్ధమైంది.

ముమ్మరంగా సభా ఏర్పాట్లు

చలో నల్లగొండ బహిరంగ సభకు పట్టణ శివారులోని నార్కట్‌పల్లి-అద్దంకి హైవేకు నుకుని మర్రిగూడ బైపాస్‌లో విశాలమైన స్థలంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో సభా నిర్వహణకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సభా ప్రధాన వేదిక, కళాకారుల వేదిక నిర్మాణం పూర్తి కావస్తుండగా గ్యాలరీల నిర్మాణం, బారీ కేడింగ్, పార్కింగ్ స్థలాలను సిద్ధం చేయడం లాంటి పనులన్నీ చకచకా సాగిపోతున్నాయి. మరోవైపు సభకు విస్తృత ప్రచారం కల్పిస్తూ ప్రజలను కదిలించేందుకు బీఆర్ఎస్ పార్టీ యావత్తు రంగంలోకి దిగింది. కృష్ణానదీ పరీవాహక ప్రాంతాలపై నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలతో పాటు తాగునీటిపై ఆధారపడిన రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి కూడా ప్రజలు తరలిరావచ్చని భావిస్తున్నారు. ఈ మేరకు పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశాల నిర్వహణ పూర్తైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కడ చూసిన చలో నల్లగొండ సభపై ప్రముఖంగా చర్చ సాగుతున్నది. రేపు సాయంత్రం 4గంటలకు సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏం చెబుతారన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

నాటి కష్టాలను గుర్తుకు తెచ్చుకుంటూ...

సమైక్య పాలనలో సాగర్ ఎడమకాల్వకు, ఏఎంఆర్‌పీ ఆయకట్టు రైతాంగం పడిన ఇబ్బందులు చలో నల్లగొండ సభ సందర్భంగా మరోసారి చర్చనీయాంశమైంది. అప్పట్లో ఎడమకాల్వను ప్రయోజనాలను పక్కన పెట్టి కుడికాల్వ ద్వారా ఒకవైపు పవర్ జనరేషన్ ద్వారా కృష్ణా డెల్టాకు మరోవైపు జలదోపిడీని గుర్తుకు తెచ్చుకుంటున్నారు. ఎడమకాల్వతో పాటు తాగు నీటి అవసరాలకు సైతం ఇక్కట్లు పడిన సందర్భాలు ఎన్నో ఉండేవని, లిఫ్టుల నిర్వహణను సైతం గాలికి వదిలేశారని రైతులే చర్చించుకుంటున్నారు. పంటలు పండకపోయినా నీటి తీరువా వసూలు చేసిన తీరు, మేజర్లకు మీటర్లు పెట్టేందుకు చేసిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. అందుకే 2004 ఆగస్టులోనే ఉద్యమ నేతగా కేసీఆర్ కృష్ణాజలాల్లో అన్యాయాలను నిలదీస్తూ కోదాడ నుంచి హాలియా వరకు చారిత్రాత్మక పాదయాత్రను చేపట్టారు. అక్కడి నుంచి మొదలైన కేసీఆర్ పోరాటం రాష్ట్రం సాధించుకునే వరకూ ప్రతి సందర్భంలోనూ కొనసాగింది. ఇక రాష్ట్ర సాధన అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రిగా కృష్ణాజలాల్లో రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం నిరంతరం శ్రమించారు. అందులో భాగంగా ఈ ప్రాజెక్టులపై తెలంగాణ రాష్ట్ర హక్కులను వినియోగించుకుంటూ కృష్ణా జలాలను సమృద్ధిగా వినియోగించారు. . ఇక జంట నగరాలకు తాగునీటి అవసరాలకు కూడా ఇబ్బందులు లేకుండా నిరంతరం సరఫరా చేయగలిగారు. సమైక్య పాలన నాటి ఇబ్బందులు... స్వరాష్ట్రంలో కేసీఆర్ సర్కార్ ప్రయోజనాలు ఛలో నల్లగొండ సభ ద్వారా ప్రజల్లో చర్చకు దారితీశాయి. తిరిగి కాంగ్రెస్ పాలనలో పాత రోజులే వచ్చే ప్రమాదం పొంచి ఉందని ఆయకట్టు రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తున్నది. అందుకే కేసీఆర్ పిలుపు మేరకు చలో నల్లగొండకు సభకు తరలివచ్చేందుకు రైతులు రెడీ అవుతున్నారు.

నల్లగొండలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఘనంగా అభయాంజనేయ స్వామి ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ

హాజరైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 11 : నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ హనుమాన్ నగర్‌లో ఆదివారం అభయాంజనేయ స్వామి 18 అడుగుల ఏకశిల విగ్రహ ప్రతిష్టాపనోత్సవం ఘనంగా జరిగింది. వేద మంత్రోచ్ఛారణలు, వేలాది మంది జయజయధ్వానాల మధ్య వేడుకను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 48 ఏండ్ల హిందువుల పోరాట ఫలితంగా 18 అడుగుల హనుమాన్ విగ్రహం ప్రతిష్టాపన చేసుకోవడం శుభపరిణామమన్నారు. అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ జరిగిన నెల రోజుల వ్యవధిలోనే నల్లగొండలో భారీ హనుమాన్ విగ్రహం ప్రతిష్ఠ చేసుకోవడం సంతోషకరమని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ విగ్రహ దాతగా ఉండడం నా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. బీఆర్ఏస్ రాష్ట్ర నాయకులు గుత్తా అమిత్‌రెడ్డి, చాడ కిషన్‌రెడ్డి కలెక్టర్ దాసరి హరిచందన, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఈ విగ్రహ ప్రతిష్టాపన వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. తెలంగాణలోనే 18 అడుగుల అభయాంజనేయ స్వామి ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ జరుగడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తుల పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత అధ్యక్షుడు వేనేపల్లి లక్ష్మణ్‌రావు, అధ్యక్షుడు బైరగోని రాజయ్య, ఉపాధ్యక్షుడు వీరెల్లి చంద్రశేఖర్, ఇటికాల క్రిష్ణయ్య, ప్రధాన కార్యదర్శి బండారు ప్రసాద్, గౌరవ సలహాదారులు కంది సూర్యనారాయణ, గార్లపాటి వెంకటయ్య, నన్నూరి రాంరెడ్డి, కోశాధికారి చింత హరిప్రసాద్, కార్యదర్శులు గుండెబోయిన వెంకటేశ్వర్లు, బోయినపల్లి సతీశ్, సురిగిమల్ల యాదగిరి, ఊట్కూరి శ్రీనివాస్, కస్పరాజు వెంకన్న, గుండెబోయిన శేఖర్, మల్లయ్య, కౌన్సిలర్ అభిమాన్యుశ్రీనివాస్, ఎడ్ల శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కోమటిరెడ్డివి మతిస్థిమితం లేని మాటలు

- సభకు అడ్డంకులు సృష్టిస్తే తొక్కుకుంటూ వెళ్తాం
- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండలో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నీలగిరి, ఫిబ్రవరి 11 :మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నల్లగొండకు రావాలంటే ముక్కు నేలకు రాసి రావాలని అని వ్యాఖ్యలు చేయడం సరికాదని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మండిపడ్డారు. నల్లగొండలో ఈ నెల 13న నిర్వహించనున్న కేసీఆర్ బహిరంగ సభా స్థలాన్ని అదివారం వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కోమటిరెడ్డి మాయ మాటలు నమ్మి ఓట్లేసిన జనం ఆయనను చీదరించుకొనే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. అవగాహన లేకుండా కేంద్రానికి కృష్ణా ప్రాజెక్టులను అప్పజెప్పి, ఇప్పుడు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయమై రైతులను జాగృత పరచడానికి నల్లగొండలో భారీ బహిరంగ సభ ఏర్పాట్లు చేస్తున్నామని, అడ్డంకులు సృష్టించడానికి కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తే తొక్కుకుంటూ వెళ్తామని హెచ్చరించారు. 20 ఏండ్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా నల్లగొండను అభివృద్ధి చేయలేపోయిన కోమటిరెడ్డి ఏ మొఖం పెట్టుకొని కేసీఆర్‌ను విమర్శిస్తున్నావని ప్రశ్నించారు. తెలంగాణ హక్కుల్ని ఇతరులకు తాకట్టు పెట్టిన విధానం, కాంగ్రెస్ చేసిన తప్పును ప్రజలకు జరుగబోయే ప్రమాదాన్ని అందరికీ చెప్పాలనే సభను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ కోసం, తెలంగాణ హక్కుల కోసం కొట్లాడేది కేసీఆర్ మాత్రమేనని మరోసారి నిరూపితమయ్యిందన్నారు. రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. వారి వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, సీనియర్ నాయకులు సింగం రామ్మోహన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, కార్యదర్శి సంధినేని జనార్దన్ రావు, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు?

కేసీఆర్ అంటే త్రీ ఫేజ్ కరెంట్.. ముట్టుకుంటే మసైపోతారు

- కేసీఆర్ సభను అడ్డుకునే దమ్ము ఎవరికీ లేదు
- ప్రెస్ మీట్‌లో మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, కిశోర్‌కుమార్



తిరుమలగిరిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, కిశోర్‌కుమార్

తిరుమలగిరి, ఫిబ్రవరి 11 : 'ఈ నెల 13న నల్లగొండలో కేసీఆర్ సభను అడ్డుకుంటామని జోకర్స్, బ్రోకర్స్ కోమటిరెడ్డి బ్రదర్స్ అనడం సిగ్గుచేటు. నల్లగొండ కేసీఆర్ అడ్డా, కేసీఆర్ అంటే త్రీ ఫేజ్ కరెంట్.. ముట్టుకుంటే మసైపోతారు. కోమటిరెడ్డి బ్రదర్స్ బెదిరింపులు కొత్తకాదు. కాంగ్రెస్ పార్టీ మొత్తం కదిలి వచ్చినా కేసీఆర్ సభను అడ్డుకోలేరు' అని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. తిరుమలగిరి మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌తో కలిసి ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని కొట్లాడి తెచ్చుకున్నది ప్రధానంగా నీళ్ల కోసమని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కృష్ణానీటిలో మన వాటా తేల్చకుండా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం రైతాంగాన్ని, ప్రజలను మోసం చేయడమేనన్నారు. కాంగ్రెస్ నాయకులు తాము చేసిన ద్రోహాన్ని కప్పి పుచ్చేందుకు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ సభను అడ్డుకునే దమ్ము ఎవ్వరికి లేదని అన్నారు. రైతుల కోసం, తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం పేగులు తేగేవరకూ పోరాడుతామని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు ప్రతి పక్షంలో ఉన్నా, పాలక వర్గంలో ఉన్నా అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ నెల 13న నల్లగొండలో జరిగే కేసీఆర్ సభకు 9 మండలాల నుంచి ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మాట్లాడుతూ ఓటుకు నోటు దొంగ రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టకరమన్నారు. ట్రిబునల్ వేసి నీటి పంపకాలు చేయకుండా 9 సంవత్సరాలు నిర్లక్ష్యం చేసింది మోదీ ప్రభుత్వం అని అన్నారు. కల్లుతాగిన కోతుల్లా కోమటిరెడ్డి బ్రదర్స్ పూటకో మాట మాట్లాడుతూ కేసీఆర్ సభను అడ్డుకుంటామని అనటం సిగ్గుచేటని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలకోసం ప్రాణాలైన అర్పించే వ్యక్తి కేసీఆర్ అని చెప్పారు. సమావేశంలో రైతు బంధు సమితి మాజీ జిల్లా కోఆర్డినేటర్ రజాక్, ఎంపీపీ స్నేహలత, మున్సిపల్ చైర్‌పర్సన్ రజినీ, పీఏసీఎస్ చైర్మన్ పాలేపు చంద్రశేఖర్, నాగారం బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పలయ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కష్టాలు

- ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్, జాజుల నరేందర్

తిరుమలగిరి (సాగర్) మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్, పక్కన ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, ట్రైకార్ మాజీ చైర్మన్ రామచందర్‌నాయక్,

తిరుమలగిరి(సాగర్)/పెద్దవూర, ఫిబ్రవరి 11 : రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కోక తప్పదని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్ కుమార్, జాజుల నరేందర్ అన్నారు. ఆదివారం తిరుమలగిరి(సాగర్), పెద్దవూర మండల కేంద్రాల్లో వారు బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలంటే సంవత్సరానికి రూ.1.50లక్షల కోట్లు అవసరమని, కానీ బడ్జెట్‌లో రూ.53వేల కోట్లు మాత్రమే కేటాయించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కృష్ణాజలాల వాటాను తేల్చకుండా పది సంవత్సరాలుగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నాన్చిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పిందని మండిపడ్డారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు వెళ్తే రైతులు, ప్రజలు నష్టపోతారని తెలిపారు. నెల్లికల్ లిఫ్ట్‌తోపాటు వివిధ పెండింగ్ పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయని చెప్పారు. నాగార్జునసాగర్ ప్రస్తుత ఎమ్మెల్యే రబ్బర్ స్టాంప్ అని, జానారెడ్డి ఏది చెప్తే అది చేయాల్సిందేనని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో కరెంట్ కష్టాలు మొదలయ్యాయన్నారు. ఈ నెల 13న నల్లగొండలో కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రామచందర్‌నాయక్, జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కడారి అంజయ్యయాదవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పిడిగం నాగయ్య, జటావత్ రవి నాయక్, నాయకులు బాబూరావునాయక్, భిక్షానాయక్, అల్లి పెద్దిరాజు, నాగెండ్ల వెంకట్‌రెడ్డి, గజ్జెల శ్రీనివాస్‌రెడ్డి, అంతయ్యయాదవ్, నడ్డి లింగయ్య, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

యాసంగి వరి సాగు గట్టెక్కేదెలా?

- జాన్‌పహాడ్‌లో నీళ్లు లేక ఎండుతున్న పంటలు
- కాల్వకు చేరని సాగర్ నీరు
- అడుగంటిన భూగర్భ జలాలతో రైతుల ఆందోళన

జాన్‌పహాడ్ గ్రామంలో ఎండుతున్న వరిపొలం

పాలకవీడు, ఫిబ్రవరి 11 : మండలంలోని పలు గ్రామాల్లో యాసంగిలో సాగు చేసిన వరిపై రైతులు ఆశలు వదిలేసుకుంటున్నారు. వానకాలంలో సన్న రకం వరి ధాన్యం క్వింటాల్ రూ.2,600 నుంచి రూ.3,200 పలుకడంతో రైతులు ఆశతో యాసంగిలో పెద్ద మొత్తంలో వరిసాగు వేశారు. నాట్లు వేసే సమయంలో కొంత నీటి లభ్యత ఉండడంతో సమస్య రాలేదు. ప్రస్తుతం పంటలు పొట్ట దశకు వచ్చే సరికి భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. పంటను కాపాడుకోవడానికి రైతులు అగచాట్లు పడుతున్నారు. తమకున్న పంట పొలాల్లో నీటి లభ్యతను పెంచుకోవడం కోసం విరివిగా బోర్లు వేస్తున్నారు. బావుల్లో పూడికలు తీస్తున్నారు. కానీ గంగమ్మ కానరాకపోవడంతో బావురుమంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో వరుసగా 18 సార్లు సాగర్ ఆయకట్టుకు నీరు వదలడంతో రైతులు చీకూ చింత లేకుండా వ్యవసాయం చేసుకున్నారు. సాగర్ నుంచి నీళ్లు రాక, ప్రస్తుతం కరువు పరిస్థితులు ఏర్పడడంతో తమ పంటలు చేతికి వస్తాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

భారీగా తగ్గిన వరిసాగు

సూర్యాపేట జిల్లాలో గత వానకాలంలో 4.37 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. యాసంగిలో లక్ష ఎకరాల్లో వరిసాగు తగ్గింది. వానకాలంలో పాలకవీడు మండలంలో 17,251 ఎకరాల్లో వరి వేయగా యాసంగిలో 11 వేల ఎకరాలకు పడిపోయింది.

కాల్వకు చేరని సాగర్ నీరు

ప్రభుత్వం సాగర్ ఆయకట్టుకు అనధికారికంగా నీటిని విడుదల చేసినా పాలకవీడు మండలంలో పలు గ్రామాల కాల్వలకు నీరు చేరలేదు. కాల్వలు అధ్వానంగా ఉండడంతో నీళ్లు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండుతున్న చెరువులు

పాలకవీడు మండలంలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటాయి. బోర్లు 60 నుంచి 300 అడుగుల వరకు వేసినా నీటి లభ్యత లభించడం లేదని రైతులు అభిప్రాపడుతున్నారు. మండలంలో కోమటికుంట, జాన్‌పహాడ్, గుండ్లపహాడ్ గ్రామాల్లో చెరువులు ఇప్పటికే ఎండిపోయాయి. దాంతో ఆయా గ్రామాల్లో తాగునీటికే దిక్కు లేదని, ఇంకా సాగు ఎక్కడిదని రైతులు వేసిన పంటలను పశువులకు మేతకు వదిలేస్తున్నారు.

కేఆర్ఎంబీ నిర్ణయంతో తెలంగాణ భవిష్యత్ ప్రశ్నార్థకమే

- 13న కేసీఆర్ సభకు ప్రజలు పెద్దఎత్తున కదలిరావాలి
- బీఆర్ఎస్ నేత గుత్తా అమిత్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత గుత్తా అమిత్‌రెడ్డి

నీలగిరి, ఫిబ్రవరి 11 : కృష్ణా జలాలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తెలంగాణ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని, దాన్ని వివరించేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 13న చలో నల్లగొండ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి కోరారు. నల్లగొండ ఆయన క్యాంపు కార్యాలయంలో అదివారం ఏర్పాటు చేసిన విలేకరలు సమావేశంలో మాట్లాడారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుతో ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లా ప్రజలు నష్టపోతారని, జంటనగరాలకు తాగునీటి ఇబ్బందులు వస్తాయని అన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ద్వారా జిల్లాలో ఆరున్నర లక్షలకు పైగా వరి సాగవుతుందని, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా 800 నుంచి 875 మెగావాట్ల విద్యుత్ తయారవుతుందని తెలిపారు. తొందరపాటు నిర్ణయంతో ప్రజల ప్రయోజనాలు, హక్కులను రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి తాకట్టుపెట్టిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కనగల్ జడ్పీటీసీ చిట్ల వెంకటేశం, బీఆర్ఎస్ నాయకులు అయితగోని స్వామి, చిలుకరాజు శ్రీనివాస్, హరి కృష్ణ ఉన్నారు.

బీఆర్ఎస్ నుంచి కొండపల్లి నిఖిలాదిలీప్‌రెడ్డి సస్పెన్షన్

- ప్రకటించిన సూర్యాపేట పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు

సూర్యాపేట, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ కొండపల్లి నిఖిల, ఆమె భర్త కొండపల్లి దిలీప్‌రెడ్డి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినందుకు వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు పట్టణ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సవరాల సత్యనారాయణ, బూర బాలసైదులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొంత కాలంగా ఇతర పార్టీలతో కుమ్మక్కై బీఆర్ఎస్‌కు నష్టం చేకూర్చే పనులు చేస్తున్నందున వారిని పార్టీ నుంచి శాశ్వతంగా బహిష్కరిస్తున్నామని, ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపారు. ఇక మీదట వారితో బీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం ఉండదని పేర్కొన్నారు.

ప్రథమ బహుమతి పొందిన నల్లగొండ మహిళా జట్టుకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీల్లో నల్లగొండ మహిళా జట్టు విజయం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 11 : భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ఆదివారం ముగిశాయి. మొదటి, రెండోరోజు 14 లీగ్ మ్యాచ్‌లు నిర్వహించగా, మూడో రోజు ఆదివారం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. అనంతరం విజేతలకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఫైనల్ పోటీల్లో పురుషుల విభాగంలో ప్రథమ స్థానంలో కరీంనగర్, ద్వితీయ రంగారెడ్డి, జాయింట్ విన్నర్స్‌లో వరంగల్, హైదరాబాద్ జట్లు నిలిచాయి. మహిళల విభాగంలో నల్లగొండ ప్రథమ, రంగారెడ్డి ద్వితీయ, మహబూబ్‌నగర్ జట్టు తృతీయ బహుమతులు గెలుచుకున్నాయి. చతుర్థి స్థానంలో హైదరాబాద్ జట్లు నిలిచాయి. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఖోఖో అసోసియేషన్ కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్‌బాబు, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి కృష్ణమూర్తి, సభ్యుడు రమేశ్ రెడ్డి పాల్గొన్నారు.